
# సైకిలు

## శ్రీమతి. కె. భానుమతి




"ఎన్నిసార్లు చెప్పినాసరే, ఆ ముసలాయన చెవి ఎక్కదుకదా, ఈ డొక్కు సైకిలు అమ్మేయ్యండి, దీనివలన ఎవరికి ఉపయోగం, ఈ అద్దెకొంపల్లో 'అదికూడా చోటుమింగటానికి కాపోతే అంటూ–తెగ సణుక్కుంటూంది వాణీ, ఇల్లు ఊడుస్తూ!

ఆ సణుగుడు ఈ రోజుదికాదు, వాణీ కాపరానికి వచ్చిన రోజునుంచీ ఉన్నదే! వచ్చిన మరునాడు ఇల్లు ఊడుస్తూ– ఈ సైకిలు ఇంకదేనికి మామగారూ, ఉపయోగమా, ఏమయినానా అంది టైర్లలో గాలిలేక చప్పగా ఉన్న వాటికేసి చూస్తూ–కొత్తరంగుపోయి, సగం తుప్పుపట్టి అసహ్యంగా కనపడుతున్న సైకిల్‌ని పక్కకి జరిపి తుడుస్తూ.

పోనీలేమ్మా అదేం మనల్ని అన్నం అడిగిందా నీరు అడిగిందా– మనకు అవసరం అయితే బాగు-చేయించుకుంటే నిక్షేపంలా పనిచేస్తుంది లేకపోతే అలా ఓ మూలే ఉంటుంది అన్నారు పడక్కుర్చీలో కూర్చుని పేపరుచూస్తూ.

ఊఁ అని ఇల్లు ఊడవటం పూర్తిచేసి లోపలకు వెళ్ళిపోయింది వాణి అది అంతటితో ఆగుతుందని మాధవరావుగారు అనుకున్నారు కానీ, అది ఆగలేదు సరికదా, రోజుకోసారయినా భర్త చెవిలో ఆ సైకిలు అమ్మకం గురించి ప్రస్తావన తీసుకువస్తేనే కానీ, భోజనం చేయదు వాణి

విని విని విసిగిపోయిన ఆయన మనసు ఈ రోజు వాణి ఉపయాన్నే అలా అనేసరికి కోపం వచ్చింది అందుకే విసురుగా– ఏమ్మా, ఆ సైకిల్‌పై నీకంత అసహ్యం, నన్ను వీధిలో పడేసిన తరువాత దాన్ని కూడా పడేయండి, అంతవరకూ అలా ఉండాల్సిందే అన్నారు ఖచ్చితమయిన స్వరంతో! పడక కుర్చీఎత్తి గోడ వారగాఉంచి బయటకు నడుస్తూ.

ఆయనకు అంత కోపం వస్తుందని అనుకోని వాణి ఖంగారు పడిపోయి, మరి నోరెత్తలేదు

అలా విసురుగా బయటకు నడిచిన మాధవయ్య కాళ్ళు, శివాజీ కేఫ్ ముందు ఆగాయి లోపలకు నడిచి ఖాళీగా ఉన్న చోట ఓ కుర్చీ చూసుకుని కూర్చుని, ఓ కాఫీ పట్రావోయ్ అన్నారు అటుగా వచ్చిన సర్వర్‌ని ఉద్దేశించి

అయిదు నిముషాలయ్యాక వచ్చిన వేడి, వేడి కాఫీ తాగి బయటపడ్డారు పక్కనే ఉన్న కిళ్ళీ కొట్లో, ప్రభ పేపరు కొన్నారు

ఎన్ టి ఆర్ బర్తరఫ్' అన్న పెద్ద పెద్ద అక్షరాలతో ఉన్న వార్త చదివి ఆశ్చర్యపోయారు గబ, గబా అక్కడ ఉన్న బల్లపై కూర్చుని ముఖ్యాంశాలను చదివి, పేపరు మడిచి చేత్తో పట్టుకుని ఇంటి దారిపట్టారు

ఇంట్లో అడుగుపెట్టగానే విన్నారా మామయ్యా ఎన్ టి ఆర్‌ని బర్తరఫ్ చేశారట అంది మాధవయ్యగారి చేతిలో పేపరు లాక్కుంటూ!

"అందులో వింత ఏముందమ్మా – నీకు సైకిలు అక్కడ ఉంచటం ఇష్టంలేక అమ్మేయమనలేదూ– అన్నాడు ద్వంద్వార్థం వచ్చేటట్లుగా

ఆ మాటతో వాణి మొహం చిట చిట లాడించు-కుంటూ లోపలకు నడిచింది పేపరుతో సహా

నాలుగు రోజుల అనంతరం వాణికి నొప్పులు ఆరంభం అయాయి అవి రాను రాను ఎక్కువ కాసాగాయి ఏంచేయాలో తెలీటంలేదు పక్క-వాళ్లను సహాయం అడుగుదామనుకుంటే, వాళ్ళు వూళ్ళో లేరు భర్త శంకరానికి తండ్రి తప్ప, పెద్ద చెప్పుకోతగ్గ దగ్గర చుట్టాలు ఎవరూ లేరు ఇంట్లో వున్న ఇద్దరు మగవాళ్ళకి, ఏం చేయాలో తెలీలేదు, వాణి కళ్ళలో నీరు తిరిగాయి

అపుడే గదిలోకి అడుగు పెట్టిన శంకరం, ఏం వాణీ బాధగా ఉందా, ఆస్పత్రికి వెళదామా, అన్నాడు

ఊఁ అంది, కళ్ళలో తిరిగిన నీరు తుడుచు-కుంటూ

శంకరం వీధిలోకి నడిచాడు రిక్షా ఏదయినా తిసుకువస్తే ఆస్పత్రికి తీసుకెళ్ళవచ్చు అని

అరగంట గడిచింది ఒళ్ళంతా చెమటతో తిరిగి వచ్చిన కొడుకుని చూసి, ఏరా శంకరం, తెచ్చావా రిక్షాని అన్నారు మాధవయ్య ,

ప్చ్, ఒక్క రిక్షాకానీ, ఆటో కానీ దొరకలేదు నాన్నా, అన్నాడు నీరసంగా కుర్చీలో వాలి

అదేంరా అన్నాడు, ఖంగారుగా మాధవయ్య

"ఈ రోజు, ముఖ్యమంత్రి బర్తరఫ్‌కి నిరసనగా బంద్ చేస్తున్నారట. అందుకని ఒక్కడుకూడా రాలేదు" అన్నాడు. ఏంచేయాలో తెలీని అయోమయ స్థితిలో.

"హుఁ" అని ఒక నిట్టూర్పు విడిచి, మీ అత్తగారు వస్తానంది కదరా, ఇంకా రాలేదేం" అన్నారు

"ఏమోఁ అక్కడ వాళ్ళకేం ఇబ్బందులో, అన్నాడు; "ఇపుడీ ఇబ్బంది గడిచేది ఎలారా భగవంతుడా" అనుకుంటూ– మనసులో!

అయిదు నిముషాలు ఎవరి ఆలోచనలో వారున్నారు. "అమ్మా" అన్న వాణి కేకకి ఆలోచనల్లోంచి బయటపడి, ఏంచేద్దాం ఆలో-చించు, ఇంకా ఎక్కువయితే కష్టం" అన్నారు మాధవరావు.

"ఏం చెయ్యాలి" అన్న ప్రశ్నకి జవాబు దొరకక తండ్రికేసి దీనంగా చూశాడు శంకరం.

కొడుకు ముహంలోకి చూసిన ఆయనకు చటుక్కున ఒక ఆలోచన మెరుపులా వచ్చింది వెంటనే, "ఒరే, శంకరం అమ్మాయిని నా సైకిల్‌పై కూర్చోపెట్టి తీసుకువెళదాంరా" అన్నారు.

అంత ఖంగారులోను నవ్వు వచ్చింది శంకరానికి, తండ్రి మాటలకు "ఏదీ, ఆ డొక్కు సైకిలా" అన్నాడు.

కొడుకు మాటల్లో వ్యక్తం అయిన నిరసన్ని, పరికించి కూడా అదేం గమనించనివాడిలా,"అవునురా మొన్న కోడలు అన్న మాటలకు పౌరుషం వచ్చి, 40 రూాలు ఇచ్చి బాగు-చేయించాను; పని చేస్తుంది. అంతకన్నా ఇపుడు మార్గం ఏముంది" అన్నారు.

రెండు నిముషాలు ఆలోచించి, "సరే, వాణీని అడిగివస్తాను ఉండు, కూర్చోగలదేమో!" అంటూ లోపల గదిలో అడుగిడి, భార్యకి చెప్పాడు తండ్రి అభిప్రాయం, బయట వున్న వాతావరణం కూడా!

"ఆఁ సైకిలా–" అని, ఇంక తప్పదుకదా అనుకుని, "సరే పదండి, ఇంకా ఎక్కువ అయితే కూర్చోలేనేమో-కూడా" అంది, పక్కనే ఉన్న ప్లాస్టిక్ బుట్ట చేత్తో అందుకుంటూ–

ఈ లోపునే, మాధవయ్య సైకిల్ తీసి వీధిలో ఉంచారు. వాణీ మెల్లిగా వచ్చి సైకిలు దగ్గర నుంచుంది.

"ఎక్కమ్మా! నీకేం భయంలేదు." అన్న మావగారి మాటలతో, సైకిల్ వెనకాల కూర్చుంది.

ఇంతలో అంటి తాళం వేసి వచ్చిన శంకరంతో, అబ్బాయి, నువు వాణీని జాగ్రత్తగా పట్టుకో, నేను సైకిలు నడిపిస్తాను". అన్నారు.

"అలాగే నాన్నా" అని భార్యని ఒక చేత్తో పట్టుకుని సైకిల్ పక్కనే నడుస్తుండగా, మాధవరావుగారు, ఇద్దరి బరువు ఆపుకుంటూ– ఎంతో జాగ్రత్తగా ఆస్పత్రి ముందు సైకిల్ ఆపేసరికి, అరగంటపట్టింది.

భర్త చేయి ఆసరాతో కిందకి దిగింది. సైకిల్ స్టాండులో ఉంచి, ముగ్గురు లోపలకు నడిచారు.

డాక్టర్లతో మాట్లాడి, హాస్పటల్‌లో ఎడ్మిట్ చేసేసరికి మరో పావు గంట పట్టింది.

ఒక గంట తరువాత వాణికి పుట్టిన పండంటి మగ పిల్లాడిని చూడడానికి లోపలకు వచ్చిన మాధవయ్యతో 'మావయ్యా– క్షమించండి, నా అవివేకానికి, ఈ రోజుఆ సైకిల్ లేకపోతే, నేను ఏ స్థితిలో ఉండే-దాన్నో," అంది కృతజ్ఞత నిండిన కళ్ళతో, మామగారి వైపు చూస్తూ!

"దాన్దేముందమ్మా, ఏదో చిన్నతనంమూలాన అలా అన్నావు; పాత వాటి విలువ మీకు ఇంకా తెలీదమ్మా!" అన్నాడు, ముప్పయి ఏళ్ళు తనని నిరంతరం ఆఫీసుకు, ఇతర పనులకు మోసి, ఎంతో మేలు చేసిన సైకిల్ శ్రమని తలుచుకుని గర్వంగా! □


తాజా వార్తలకు

ఆంధ్రపత్రిక దిన పత్రిక

చదవండి.

HPF

**Meet India's biggest film producer.**

INDU

**HINDUSTAN PHOTO FILMS**
**MFG. CO. LTD.**
(A Government of India Enterprise)
Regd Office Udhagamandalam 643 005, INDIA
Marketing Division Ambal Building P B No 748
Madras 600 006 INDIA

*With Best Compliments From*

**TRANSPORT CORPORATION OF INDIA LTD.,**

**VIJAYAWADA.**

Biggest & Greatest
Transport in our
Country moving with
700 Trucks
Daily with your Goods.